సాక్షి నంద్యాల

ఆదివారం । 11 । జూన్ । 2023



'మద్దిలేటయ్య' కిటకిట

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్త జన సందోహంతో కిక్కిరిసి పోయింది. ఉదయం నుంచే ఆలయ క్యూలైన్లలో రద్దీ కనిపించింది.



నేడు ప్రారంభం

డోన్: పట్టణంలో రూ. 3కోట్లతో నూతనంగా నిర్మించిన ఆర్అండ్బీ అతిథి గృహాన్ని ఆదివారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించనున్నారు.



క్వింటా రూ.10వేల పైనే!

మార్కెట్లో కందుల ధర పెరుగుతోంది. ప్రస్తుతం క్వింటా రూ.10 వేల పైనే ధర పలుకుతోంది. లోకల్ కంది పప్పు కిలో రూ.రూ.145 నుంచి రూ.150 మధ్య విక్రయిస్తున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

నంద్యాల డీఈఓగా సుధాకర్‌రెడ్డి



నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారిగా కె.సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డోన్ డిప్యూటీ డీఈఓగా పని చేస్తున్న ఈయనకు పదోన్నతి కల్పిస్తూ నంద్యాల డీఈఓగా బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈఓగా కొనసాగుతున్న అనురాధను రెగ్యులర్‌గా ఉండే అసిస్టెంట్ డైరెక్టర్‌గానే తిరిగి నియమించారు. జిల్లా ఏర్పాటైన 13 నెలల్లో విద్యాశాఖలో ముగ్గురు డీఈఓలు మారారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12వ తేదీ నుంచి ఇంగ్లిష్ మీడియంపై జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ శనివారం తెలిపారు. 17వ తేదీ వరకు రెండు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈఎఫ్ఎల్‌యూ, మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులు ఉంటాయని చెప్పారు. శిక్షణ తరగతులను కంప్యూటర్ సైన్స్, అధ్యాపకుడు రాజేందర్, ఇంగ్లిష్ అధ్యాపకురాలు పార్వతి పర్యవేక్షిస్తున్నారని వివరించారు.


విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: ఆరోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ హెచ్చరించారు. బ్రాహ్మణకొట్కూరు పరిధిలోని దామగట్ల వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. హెల్త్ క్లినిక్‌కు వచ్చిన రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల ఫలితాలు త్వరితగతిన ఇవ్వాలని, మందులు పంపిణీ చేసి రోగి ఆరోగ్యస్థితిని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. గర్భిణులకు ఆరోగ్య సూచనలు ఇవ్వాలన్నారు. గుండె జబ్బులు, షుగర్, బీపీ లాంటి జబ్బులు ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

మద్దిలేటి స్వామికి ఒక్క రోజు ఆదాయం రూ.13.40 లక్షలు



రూ. లక్ష విరాళం అందజేస్తున్న వైఎస్సార్ జిల్లా సుద్దపల్లె మద్దిలేటి రెడ్డి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్క రోజు రూ. 13.40 లక్షల ఆదాయం వచ్చింది. సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. 13,40,027 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ జిల్లా సుద్దపల్లె గ్రామానికి చెందిన బైరెడ్డి మద్దిలేటి రెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతకు తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, ఆకుల రమణ, మద్దయ్య, క్రిష్టారెడ్డి, వెంగళ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

సంజామల: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం సంజామలలో రూ.1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం, రూ.75 లక్షలతో నిర్మించిన ఏరియా పశువైద్యశాల నూతన భవనాలను శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి బుగ్గన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎక్కడా లేని విధంగా సంజామల ఎంపీడీఓ కార్యాలయం ఉందన్నారు. కరోనా సమయంలో టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేశ్ రాష్ట్రం వదిలి హైదరాబాద్‌లో దాక్కొని ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు.

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె ప్రజల ముంగిటికే సేవలు తెచ్చారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న విద్యా దీవెన తదితర బృహత్తర పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపాయన్నారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలు కొనసాగాయన్నారు. జలజీవన్ పథకం కింద బనగానపల్లె నియోజకవర్గానికి రూ.100 కోట్లు మంజూరు కావడంతో ఇప్పటి వరకు రూ. 70 కోట్లతో పనులు చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ వెంటే ప్రజలు ఉన్నారని, మళ్లీ తమ ప్రభుత్వమే వస్తుందన్నారు. నంద్యాలలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.



ఏరియా పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్లు వేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు.
- అవుకు రిజర్వాయర్ నుంచి వరద నీరుతో బొందలదిన్నె, కమలపురి, ముదిగేడు వాగులు ఉప్పొంగి పంటలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారని సమస్యను పరిష్కరించాలని, సంజామలలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డు వేయాలని కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్య ప్రకాశ్ రెడ్డి మంత్రి, ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి పోచా శీలా రెడ్డి, జిల్లా యువజన కార్యదర్శి గుండం నాగేశ్వర్ రెడ్డి, ఏవీర్ కాలేజ్ చైర్మన్ వెంక్రమిరెడ్డి, కొలిమిగుండ్ల, అవుకు మండల కన్వీనర్లు అంబటి గురివి రెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి, సంజామల వైస్ ఎంపీపీలు చిన్నబాబు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేఆర్ఎంబీ చైర్మన్ రాక

శ్రీశైలంప్రాజెక్ట్: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ చైర్మన్ శివనందన్ ఆదివారం శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సందర్శించనున్నారు. శనివారం రాత్రి ఆయన శ్రీశైలానికి చేరుకున్నారు. వర్షాకాలం సమీపించడంతో శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రత, పటిష్టత వంటి అంశాలను ఆయన పరిశీలించనున్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 18వ తేదీ (ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

కర్నూలు: ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్ కలిసి జూన్ 18వ తేదీ(ఆదివారం) ఉదయం 09 నుంచి 12.30 వరకు కర్నూలులోని BAS.Kalyana mandapam,Opp.S.V.Complex,R.S.Road నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో..

ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర(కరెంట్అఫైర్స్), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి లెజండరీ ఫ్యాకల్టీలు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు.. అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు.

- త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్-2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ:
జూన్ 18, 2023 (ఆదివారం)

వేదిక:
బీఏఎస్ కల్యాణమండపం, ఎస్‌వీ. కాంప్లెక్స్ ఎదురుగా, ఆర్ఎస్ రోడ్, కర్నూలు.

సమయం:
ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

హోరాహోరీగా చెస్ పోటీలు



పోటీలు జరుగుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 స్టేట్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం మూడో రోజూ హోరాహోరీగా సాగాయి. టోర్నమెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి పోటీలను పర్యవేక్షించారు. 6వ రౌండ్ ముగిసే సమయానికి తిరుపతి జిల్లాకు చెందిన క్రీడాకారుడు విశాల్ చౌదరి 5.5/6 పాయింట్స్, కోన సీమ జిల్లాకు చెందిన సాత్విక్ 5.5/6 పాయింట్స్‌తో ముందంజలో ఉన్నారని ఆంధ్రా చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ తెలిపారు.

పలకరించిన వరుణుడు

- ఒక మోస్తరు నుంచి భారీ వర్షం

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(సెంట్రల్): జిల్లాలోని 12 మండలాల్లో శుక్రవారం రాత్రి 9.45 నుంచి శనివారం ఉదయం వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. కోడుమూరులో అత్యధికంగా 40.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పదునైన వర్షాలు కురిస్తే పత్తి, కంది, వేరుశనగ తదితర పంటలకు సంబంధించి విత్తుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నైరుతి రుతుపవనాలు విస్తరించడంలో కొంత జాప్యం కారణంగా వర్షాలు కూడా ఆలస్యమవుతున్నాయి. జిల్లా మొత్తంగా 7.9 మి.మీ వర్షం కురిసింది.

- నంద్యాల జిల్లాలోని ఏడు మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. డోన్‌లో అత్యధికంగా 32.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇదే సమయంలో ఉష్ణోగ్రతలు కూడా అధికంగానే నమోదు అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆలూరులో 42.45 డిగ్రీలు, మంత్రాలయంలో 40.2, చాగలమర్రిలో 42.06, దొర్నిపాడులో 41.63.. మహానంది మండలం గాజులపల్లిలో 41.22 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ)
డోన్	32.2
కర్నూలు అర్బన్	27.4
గూడూరు	24.2
గోనెగండ్ల	20.4
కర్నూలు రూరల్	19.6
బేతంచెర్ల	8.2
బనగానపల్లె	4.8

క్లుప్తంగా

కందుల ధర క్వింటా రూ.10వేల పైనే!

కర్నూలు(అగ్రికల్చర్): ఏడెనిమిదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కందుల ధర పెరుగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కందుల ధర రూ.10 వేల పైనే ఉండటం విశేషం. కర్నూలు మార్కెట్‌లో కనిష్ట ధర రూ.9,670, గరిష్ట ధర రూ.9750 లభించింది. 2023–24 సంవత్సరానికి కందుల మద్దతు ధర కూడా పెరిగింది. క్వింటాకు రూ.400 పెంచడంతో మద్దతు ధర రూ.7వేలకు చేరింది. కందుల ధర పెరుగుతుండటంతో కందిపప్పు ధర కూడా అదేస్థాయిలో ఉంటోంది. తాండూరు కంది పప్పు కిలో రూ.150పైనే పలుకుతుండగా.. లోకల్ కంది పప్పు కిలో రూ.145 నుంచి రూ.150 మధ్య పలుకుతోంది.

మద్దిలేటిస్వామి క్షేత్రానికి పాదయాత్ర



గ్రామస్తులతో కలిసి పాదయాత్రగా వస్తున్న ఐఏఎస్ అధికారి చిన్నరాముడు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి శనివారం బుగ్గానిపల్లె తండాకు చెందిన ఐఏఎస్ అధికారి చిన్న రాముడు గ్రామస్తులతో కలిసి పాదయాత్రగా చేరుకున్నారు. ఉదయం గ్రామం నుంచి బయలుదేరి బుగ్గానిపల్లె, బేతంచెర్ల, హెచ్.కొట్టాల, ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ దర్శనం అనంతరం అంబాపురం మీదుగా మద్దిలేటయ్య క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి చిన్న రాముడు దంపతులకు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

ఆర్టీసీ బస్సులో హెడ్ కానిస్టేబుల్ మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

సి.బెళగల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు (51) గుండెపోటుతో ఆర్టీసీ బస్సులో మృతి చెందినట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు. కర్నూలులో నివాసముండే నాగేశ్వరరావు శనివారం ఉదయం కర్నూలు నుంచి గూడూరు మండలం పెంచికలపాడుకు ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అక్కడి నుంచి గూడూరుకు చేరుకుని, సి.బెళగల్‌కు వెళ్లాలనే ఉద్దేశంతో గుండ్రేవుల ఆర్టీసీ బస్సును ఎక్కి చివరి సీటులో కూర్చున్నారు. అయితే గూడూరు చేరుకునేలోగానే గుండెపోటుకు గురై బస్సు లోనే కుప్పకూలాడు. గుండ్రేవులలో విషయాన్ని గమనించిన కండక్టర్ సి.బెళగల్ పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య కాంచన, కుమార్తె నవ్యశ్రీ ఉన్నారు.


ఫొటో ఆఫ్ ది డే



కష్టం వచ్చిందని బాధపడుతూ కూర్చుంటే సమస్య రెట్టింపు అవుతుందే కానీ, పరిష్కారం లభించదు. ఈ కోవలోనే కర్నూలుకు చెందిన ఓ దివ్యాంగుడు స్వశక్తితో బతుకు బండిని లాగిస్తున్నాడు. మూడు చక్రాల బండిని తనకు అనుకూలంగా ఎండకు నీడనిచ్చేలా మార్చుకున్నాడు. కాళ్లు లేవని ఆగిపోకుండా, ఈ బండితో ఎండలో ఎలా తిరిగేదని ఆలోచిస్తూ కూర్చోకుండా ఉన్న తోడునే నీడగా మార్చుకున్న తీరు అభినందనీయం. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

వేద పారాయణంతో కర్నూలు సుభిక్షం

- కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి





శంకర మఠంలో అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి, హాజరైన భక్తులు

కర్నూలు(అర్బన్): కరివేన సత్రం ఆధ్వర్యంలో వేద పాఠశాలను నిర్వహించడం అభినందనీయమని, నిత్యం వేద పారాయణ జరగడం వల్ల కర్నూలు సుభిక్షంగా ఉంటుందని కంచి మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. ఈనెల 9వ తేదీన కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక ఖండేరిలోని శంకర మఠంలో శ్రీచంద్ర మౌళీశ్వరస్వామి పీఠం పూజలు నిర్వహించారు. శనివారం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కర్నూలుకు, కంచి మఠానికి ఎంతో అవినావభావ సంబంధం ఉందని చెప్పారు. హిందువులు అందరూ గంగా నది, గోమాత, భగవద్గీతలను పూజించాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి కులంలోని పెద్దలు పిల్లలకు బోధించాలన్నారు. అలాగే అన్ని కుల సంఘాలలో సంస్కృతి విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా విభాగాలను ఐకమత్యంగా ఉండి ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. వారణాసి క్షేత్రంలో చాతుర్మాస దీక్ష పూర్తయిన అనంతరం రాయలసీమ జిల్లాల్లో పర్యటన చేస్తామని తెలిపారు. కంచి మఠం ఆధ్వర్యంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'దేవుని స్వరం' అనే పుస్తకాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. సనాతన హైందవ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరివేన సత్రం నిర్వాహకులు డాక్టర్ వేణుగోపాల్, కె.చిదంబరం రావు, హెచ్.కె.మనోహర్‌రావు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్.కె.రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

2,300 ఎకరాల్లో పండ్ల తోటల అభివృద్ధికి అనుమతులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో 2023–24లో 6,450 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి లక్ష్యంగా ఎంచుకుంది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ జి.సృజన 2,300 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి పరిపాలన అనుమతులు(అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్) ఇచ్చారు. ఆ మేరకు పండ్ల మొక్కలు నాటడానికి వీలుగా గుంతలు(పిట్టింగ్) తవ్వే పనులను కూడా ప్రారంభించడం విశేషం. ఇప్పటికే 57 ఎకరాల్లో రైతులు ఇందుకు సంబంధించిన పనులు మొదలుపెట్టారు. ఎంచుకున్న లక్ష్యంలో 5,574 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి రైతులను గుర్తించారు. లక్ష్యం మేర పండ్లతోటల అభివృద్ధికి జాబ్ కార్డులు కలిగిన సన్న, చిన్నకారు రైతులను గుర్తించే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి .. ఏపీవో, ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధి నిధులతో పూర్తి సబ్సిడీతో అన్ని రకాల పండ్లతోటలు, మునగ, పూల తోటలను అభివృద్ధి చేసుకోవచ్చని పీడీ తెలిపారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద సీతాఫలం, నేరెడు, మామిడి, రేగు పండ్ల మొక్కలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.

'బత్తుల' లేక్ ఫ్రంట్ మోడల్ విల్లాస్ అత్యద్భుతం



'బత్తుల ఫ్రంట్ లేక్' పరిసరాల్లో పర్యటిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



'బత్తుల' మోడల్ విల్లా

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(న్యూటౌన్): అత్యాధునిక టెక్నాలజీతో 'బత్తుల' బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత బత్తుల నాగార్జునరెడ్డి నిర్మించిన రెండు మోడల్ విల్లాస్ అత్యద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. శనివారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామ శివారులో నగరవనం పక్కనే 'బత్తుల లేక్ ఫ్రంట్' మోడల్ విల్లాస్ ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విల్లాస్‌తో పాటు పరిసరాల్లో కల్పించిన అత్యాధునిక సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం బత్తుల బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత బత్తుల నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 ఎకరాల్లో 228 మోడల్ విల్లాస్‌ను 24 నెలల టైమ్‌లైన్‌తో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కొనుగోలుదారుల వద్ద తీసుకున్న ప్రతి రూపాయిని 100 శాతం విలువ ఇస్తామన్నారు. 'బత్తుల లేక్ ఫ్రంట్' మోడల్ విల్లాస్‌ను ఏపీలోనే నంబర్ వన్‌గా తీర్చిద్దుతామన్నారు. ఇండియాలోని టాప్10 బిల్డర్స్‌లో 'బత్తుల' బిల్డర్స్ ఒకటిగా నిలిచిందన్నారు. 4 సెంట్ల మోడల్ విల్లా ఇంటీరియర్స్‌తో రూ.1.85 కోట్లు, 8 సెంట్ల మోడల్ విల్లా ఇంటీరియర్స్‌తో రూ.3.75 కోట్ల ధర నిర్ణయించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కర్నూలు మేయర్ బీవై రామయ్య, కుడా చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, స్కందాన్షీ బిల్డర్స్ అధినేత సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక క్షేమం

కోడుమూరు రూరల్: తల్లిదండ్రులు మందలించడంతో అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన అమూల్య (14) క్షేమంగా ఉందని తెలిసింది. ఈ బాలిక గత గురువారం ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తండ్రి హరిక్రిష్ణ శుక్రవారం కోడుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు శనివారం ప్యాలకుర్తి చేరుకుని గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇదే సమయంలో అదృశ్యమైన బాలిక తణుకు పోలీస్‌స్టేషన్‌లో ఉందంటూ ప్యాలకుర్తికి ఫోన్ రావడంతో అక్కడే ఉన్న ఎస్ఐ శ్రీనివాసులు వివరాలను కనుక్కొని, బాలికను ఇంటికి పిలుచుకుని వచ్చేలా కోడుమూరు నుంచి హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు బాలిక తండ్రిని పంపించారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్ దుర్మరణం

- పది రోజుల క్రితం కుమారుడి పెళ్లి
- అంతలోనే తండ్రి మృత్యువాత



నాగిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఫైల్)

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై కొచ్చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ దుర్మరణం చెందాడు. పాణ్యం ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోనవరం గ్రామానికి చెందిన నాగిరెడ్డి భాస్కర్‌రెడ్డి(63) ఆర్మీలో పనిచేస్తూ 2007లో రిటైర్ అయ్యాడు. ఆ తర్వాత స్వగ్రామం నుంచి వచ్చి పాణ్యంలో నివాముంటున్నాడు. ఇతని ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈనెల 1వ తేదీన రెండవ కుమారుడి వివాహం జరిగింది. శనివారం కుటుంబమంతా మద్దిలేటి స్వామి క్షేత్రంలో మొక్కుబడి తీర్చుకునేందుకు వెళ్లారు. అక్కడి నుంచి భాస్కర్‌రెడ్డి బైక్‌పై పాణ్యంకు వస్తుండగా కొచ్చెరువు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి సైడ్‌కు ఉన్న ఇనుప గ్రిల్‌ను ఢీ కొట్టారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో హైవే పెట్రోల్ సిబ్బంది స్థానిక శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మైపర్ టెన్నిస్ అకాడమీకి పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): రాయలసీమ స్థాయిలో నిర్వహించిన టెన్నిస్ పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన మైపర్ టెన్నిస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. అనంతపురం పట్టణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న భాస్కరాచార్య ఓపెన్ మెమోరియల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో శనివారం నిర్వహించిన పోటీల్లో అండర్–10 విభాగంలో విన్నర్‌గా రామ్‌ధీరజ్, రన్నర్‌గా సాయి సుజయ్ నిలిచారు. అదేవిధంగా అండర్–12 విభాగంలో విన్నర్‌గా సమృద్ధి కన్నా, రన్నర్‌గా ధ్యానేశ్వర్ నిలిచారు. అలాగే మహిళా విభాగంలో రన్నర్ అప్‌గా షేక్ అర్షియా నిలిచారు. అన్ని విభాగాల్లో పతకాలు సాధించిన టెన్నిస్ క్రీడాకారులను మైపర్ టెన్నిస్ అకాడమీ కోచ్ షేక్ మహమ్మద్ రఫీ అభినందించారు.

ఉపాధ్యాయుల బదిలీలు కొలిక్కి!

కర్నూలు(సిటీ): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి కావచ్చింది. గతంలో బదిలీలు అంటే విద్యా శాఖలో గందరగోళం ఉండేది. ప్రస్తుత బదిలీల్లో ఏమాత్రం చడీచప్పుడు లేకుండా ప్రశాంతంగా ప్రక్రియ పూర్తవుతోంది. జిల్లాలో బదిలీల కోసం 7,143 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. 7,116 మంది వెబ్ ఆప్షన్స్ ఇచ్చారు. వీరిలో అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు 4,453 మంది బదిలీ అయ్యారు. కచ్చితమైన బదిలీలకు 1,932 మంది దరఖాస్తు చేసుకోగా 1924 మంది బదిలీలు పూర్తయ్యాయి. రిక్వెస్ట్ మీద 1,407 మంది బదిలీ అయ్యారు. అదే విధంగా పదోన్నతుల్లో విల్లింగ్ ఇచ్చిన 1,078 మంది ఉపాధ్యాయులు ఉండగా వీరిలో ముగ్గురు టీచర్లు పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చినా కూడా వారి వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకున్న తర్వాత దరఖాస్తులను సబ్‌మిట్ చేయకపోవడంతో పదోన్నతుల అవకాశాన్ని, వారు పనిచేస్తున్న స్థానాన్ని సైతం కోల్పోయారు.

నేటిలోపు విధుల్లో చేరాలి

బదిలీ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులందరూ నేటిలోపు(ఆదివారం) ఆయా స్థానాల్లో చేరాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులు బదిలీ అయిన స్థానాల్లో చేరారు. ఉత్తర్వులు పొంది విధుల్లో చేరని వారు, బదిలీ ఉత్తర్వులు శనివారం సాయంత్రం నుంచి పొందిన సెకండ్ గ్రేడ్ టీచర్లు అందరూ విధుల్లో చేరాలని అధికారులు పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో ఆరోజు అందరూ బదిలీ అయిన స్థానాల్లో విధిగా విధులకు హాజరుకావాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

భాషా పండితులకు మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్

జిల్లాలో భాషా పండితులకు ఈనెల 13న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో భాషా పండిట్‌లు 772 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 233 మంది బదిలీ కానున్నారు. అదే విధంగా 103 మంది కంపల్సరీ బదిలీ కానున్నారు. 130 మంది రిక్వెస్ట్ బదిలీపై వెళ్లనున్నారు.